31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం, నవంబర్ 08 , 2026 పేజీలు : 8

వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి ప్రమాణస్వీకారం

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 7 : వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా హకీంపేట్ లోని జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్ లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొని ఆయనకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అంతకుముందు మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు చిత్రపటానికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జువ్వాడి రత్నాకర్‌రావు కుటుంబంతో తనకు మొదటి నుంచి మంచి అనుబంధం ఉందని తెలిపారు. జువ్వాడి నర్సింగ రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, -మిగతా 2లో

పెట్రోల్ పంపునకు ప్రభుత్వ భూమిలీజుపై లోకాయుక్తకు ఫిర్యాదు

డిసెంబర్ 3లోగా నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ లోకాయుక్త ఆదేశం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 7: జగిత్యాల పట్టణంలోని సర్వే నం. 105లోని ప్రభుత్వ భూమిని పెట్రోల్ పంపు కోసం లీజుకు ఇవ్వడంపై మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి తెలంగాణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్న వివరాల ప్రకారం 621 చదరపు గజాల (0.0520 గుంటలు) ప్రభుత్వ భూమి నిషేధిత జాబితాలో ఉందని, రిజిస్ట్రేషన్ చట్టం 22-ఏ ప్రకారం లీజుకు ఇవ్వకూడదని, జీవో ఎంఎస్ 1493 తేదీ 01.12.2007 ప్రకారం ఇళ్ల స్థలాలకు మాత్రమే కేటాయించాలని తెలిపారు. నెలకు రూ.72 వేల నామమాత్రపు అద్దె నిర్ణయించడం జీవో 571 తేదీ 14.08.2012 ఉల్లంఘన అని, మార్కెట్ రేటు కంటే తక్కువని ఆరోపించారు. 1906లో నిజాం ప్రభుత్వం నిర్మించిన 120 ఏళ్ల చారిత్రక తహసీల్ కార్యాలయాన్ని పురావస్తు శాఖ అనుమతి లేకుండా కూల్చి, టెండర్ లేకుండా ఆయిల్ కంపెనీకి కేటాయించడం వల్ల వెనుక ఉన్న ప్రభుత్వ భూమి వాణిజ్య విలువ దెబ్బతింటుందని పేర్కొన్నారు. కలెక్టర్ కు వినతి ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు.దీనిపై స్పందించిన లోకాయుక్త జగిత్యాల కలెక్టర్ (పీఎస్-3) బాధ్యతగల అధికారి ద్వారా నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 3కు వాయిదా వేసింది.



అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించడమే లక్ష్యం

-ఎన్యుమరేషన్ ఫారాలకు నవంబర్ 21 వరకు గడువు -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 7: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ - 2026 ప్రక్రియపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించగా, జగిత్యాల కలెక్టర్ బి.సత్య ప్రసాద్, అధికారులు సమీకృత కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద జాబితాలో ఉన్న అర్హులైన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు -మిగతా 2లో



కాసుకునే ఉంటాడు... వేసుకునే వెళ్తాడు

కాసులిస్తేనే ఫైలు కదలిక... ఓ తహసీల్దార్ అవినీతి పర్వం

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 7: జిల్లాలోని ఓ తహసీల్దార్ పనితీరు ఆది నుంచి వివాదాస్పదంగా మారింది. డబ్బులివ్వనిదే ఏ ఫైలును ముట్టుకోవడం లేదని, ఏ పని కూడా జరుగదం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేరే జిల్లాలో పని చేసిన కాలంలో ఏసిబికి పట్టుబడ్డ ఆయన తీరు జగిత్యాల జిల్లాకు వచ్చినా మారడం లేదు. ఉన్నతాధికారులు సైతం ఆయనకు కీలక మండలంలోనే పోస్టింగ్ ఇవ్వడం, ఆరోపణలుంటున్నా బదిలీ చేయకపోవడం, ప్రజలేమో తమ పనులు పూర్తికాక ప్రస్తుతం ఆయన పని చేస్తున్న మండల ప్రజలు బేంబెలెత్తిపోతున్నారంటే పరిస్థితి అర్థమవుతుంది. ఎమ్మెల్యే చెప్పినా, ప్రతిపక్ష నేత చెప్పినా ఆయన ధోరణి అలాగే ఉందనే ఆరోపణలున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఆయన్ను బదిలీ చేయకపోవడంతోనే అందినంత దండుకుంటున్నాడని ఆరోపణలున్నాయి. భూముల రిజిస్ట్రేషన్ కు , నాలా కన్వర్షన్ కు అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా, రిజిస్ట్రేషన్ కు స్లాట్ బుక్ చేసుకున్నా ముడుపులు ఇవ్వకుంటే రకరకాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని ప్రజలు వాపోతున్నారు. విరాసత్ అమలు, పాస్ బుక్ లో వివరాల తప్పుల సవరణకు, నమోదుకు తదితర పనులు పూర్తి చేయడానికి డబ్బులు సమర్పించుకుంటేనే తప్ప పనులు జరగడం లేదనే ఆరోపణలున్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూములను తీసి వేయడానికి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. వాస్తవానికి వాటికి రైతుబందు సహాయం వస్తుంది. పాసుపుస్తకాలు సైతం ఉన్నా, వారికి సంబంధించిన భూములు అమ్ముకోవడానికి రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే మీ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని చెబుతూ వేలాది రూపాయాలు ఇస్తేనే ఆ భూములు రిజిస్ట్రేషన్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. సాదాబైనామా కేసుల్లో దరఖాస్తుదారులు ఫీజులు కట్టిన తర్వాత కూడా వారికి 13-బి సర్టిఫికేట్ (మ్యూటేషన్ కు , పట్టా దార్ పాసుబుక్ మంజూరుకు అనుమతి ఇచ్చేది) ఇచ్చి ఆ భూములను కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయడం లేదని సమాచారం. ముడుపులు ఇవ్వని వారి ఫీజులు కట్టించుకున్న తర్వాత ఆన్ లైన్ లో అమ్మకందారుడి పేరు కనిపించడం లేదని, సర్వే నంబర్లు సరిపోలడం లేదనే కారణాలతో వాటిని ఇంకా పెండింగ్లోనే పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇంకో విశేషమేమిటంటే ఆన్లైన్లో 13-బి సర్టిఫికేట్ జారీ చేసేందుకు అవసరమైన సాఫ్ట్వేర్ లేదని, పాస్ బుక్ ఇచ్చేందుకు కుదరడం లేదని చెబుతున్నారని ఆఫీసు ఆవరణలో ఆర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులిస్తే ఎలాంటి ఎంక్వయిరీ చేయకుండానే చాలా విలువ గల పట్టణ పరిధిలోని భూములకు నకిలీ సాదాబైనామా ద్వారా పట్టా చేసినట్లు, దీనిపై విచారణ జరిపించాలని సంబంధిత అసలు పట్టాదారులు కోరుతున్నారు. భూసర్వే కోసం సైతం ఆ అధికారికి డబ్బులు ముట్టజెప్పితేనే సర్వేయర్ కు ఆర్డర్ ఇస్తున్నాడని, తర్వాత సర్వేయరు సైతం అడిగినంత డబ్బులు ఇస్తేనే కొలతలు -మిగతా 2లో

సామవేదంలో ప్రతిభ కనబర్చిన షణ్ముఖి ఘన సన్మానం

-రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రజత పతకం



చురకలు విలేకరి,మెట్ పల్లి రూరల్, నవంబర్ 7 : మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన మునుగోటి రవిశర్మ కుమారుడు మునుగోటి షణ్ముఖ శర్మ సామవేదం పూర్వభాగం (మూలాంతం) విభాగంలో ఉత్తమ శ్రేణిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రజత పతకాన్ని ఇటీవలే అందుకోగా శనివారం అదే గ్రామానికి చెందిన షణ్ముఖ శర్మ సాధించిన ఘనతకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన ప్రతిభను అభినందిస్తూ గ్రామ పంచాయతీ ఆవరణలో తల్లితండ్రులు మునుగోటి రవిశర్మ,ప్రవంతి కుమారుడు షణ్ముఖ శర్మ కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.వేద విద్యలో ప్రతిభ చాటుకుని గ్రామానికి గర్వకారణంగా నిలిచిన షణ్ముఖ శర్మను పలువురు అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.సర్పంచ్ చిట్యాల రాజారాం, ఉపసర్పంచ్ కసాడి తిరుపతి, కార్యదర్శి మహేష్, దుద్దుల తిరుపతి, మాకునూరి రాజేష్,సురేష్ రెడ్డి, ప్రశాంత్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ







చురకలు విలేకరి,కరీంనగర్ నవంబర్ 7 : మజిలీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో బేసిక్ ఆఫ్ ఇస్లాం అనే అంశంపై నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో అత్యధిక మార్కుల పొందిన విజేతలకు కాశ్మీర్ గడ్డలోని ఓ ఫంక్షన్ హాల్ లో, మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ ఉభయ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి, ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. మదర్సా ఇస్లాహిల్ బనాత్ హుస్సేనిపురకు చెందిన విద్యార్థిని ఖవుల మొదటి బహుమతిని గెలుచుకున్నారు. మొదటి విజేతకు పదివేల నగదు తో పాటు ఒక గిఫ్ట్ ఒక జ్ఞాపికను అందజేశారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని సన అనే విద్యార్థినికి రెండవ బహుమతి దక్కింది. రెండో బహుమతి కింద 7వవేల నగదు ఒక గిఫ్ట్ తో పాటు జ్ఞాపికను అందజేశారు. మదర్సా ఇస్లాహిల్ బనాత్ కు చెందిన సనా ఫర్హిన్ అనే విద్యార్థిని మూడవ విజేతగా నిలిచారు. మూడవ బహుమతిగా 5వేల నగదు ఒక గిఫ్ట్ తో పాటు ఒక జ్ఞాపికను అందజేశారు. 80 మార్కులు 90 మార్కులు సాధించిన విద్యార్థులకు సైతం కన్సోలేషన్ బహుమతులను అందజేశారు.

కాసుకుని ఉంటాడు.. వేసుకునే వెళ్తాడు...

మొదటి పేజీ తరువాయి....

చేస్తున్నారని లేకుంటే పెండింగ్ లో పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. కోర్టు కేసుల కోసం రికార్డుల నకలు కావాలన్నా సదరు అధికారి అనుమతికి, నకల్లు ఇచ్చే అసిస్టెంట్ కు డబ్బులు ముట్టజెప్పాల్సి వస్తుందని ఆర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యామిలీ మెంబర్స్, ఇతర ధృవపత్రాల జారీకి కూడా డబ్బులు దండుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. కొందరు అధికారులు, సిబ్బంది, మధ్యవర్తులుగా డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారులు ఆ తహసీల్దార్ ను వెంటనే బదిలీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్బన్ తహసీల్దార్ పై సర్పంచుల ఆరోపణలు...

జగిత్యాల అర్బన్ తహసీల్దార్ పై మండల పరిషత్లో శుక్రవారం జరిగిన అభివృద్ధి సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ముందే సర్పంచులు పలు అవినీతి ఆరోపణలు చేశారు. తిప్పన్నపేట, మోతె, అంబారీపేట, ధరూర్ గ్రామాల సర్పంచులు మహేష్, దావ తిరుపతి, గోడి సెల గంగాధర్, శీలం సురేందర్లు ఆ అర్బన్ తహసీల్దార్ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆ తహసీల్దార్ ను ఎమ్మెల్యే సమావేశంలోనే మందలించడం జగిత్యాల అర్బన్ మండలంలో చర్చనీయాంశంగా మారింది.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి.... సమర్పించేందుకు నవంబర్ 21 వరకు అవకాశం కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలను కారణాలతో సహా ప్రదర్శించాలని, వెబ్ సైట్ లో ఉంచాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో కలిసి ఇంటింటి సర్వే చేసి, ఫోన్ నంబర్లు ఉన్న ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా ఫారాలు పంపాలన్నారు. పాత ఎపిక్ నంబర్ తో ఎన్నికల సంఘం వెబ్ సైట్, యాప్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చున్నారు. ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసిన వారు మళ్లీ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 77 వేల మంది గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద ఓటర్లను గుర్తించామని, ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ప్రసునాంబ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వెలమ కార్పొరేషన్ చైర్మన్గా...

మొదటి పేజీ తరువాయి.... గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యుడు కె.వి.పి. రామచంద్రరావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, జువ్వాడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నంబర్ 7 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా హుజూరాబాద్ నియోజకవర్గంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో శనివారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులను శాలువాలతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారితో కలిసి టపాసులు పేల్చి పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, సొంతింటిలో దీపావళి జరుపుకోవడం లబ్ధిదారుల కుటుంబాల్లో కొత్త ఆనందాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంచలనం సృష్టించిన వృద్ధురాళ్ల వరుస హత్యల కేసు ఛేదన





చురకలు క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, నవంబర్ 7 : బంగారు, వెండి ఆభరణాల కోసం ఊపిరాడకుండా చేసి హత్యలు సహజ మరణాలుగా నమ్మించేందుకు నిందితుల కుట్ర నిందితుల నుంచి టీవీఎస్ జూపిటర్, బజాజ్ పల్సర్ బైక్, వెండి కడియాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం.కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించిన సీపీ గౌస్ ఆలం తిమ్మాపూర్ మండల పరిధిలోని వచ్చనూర్ గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారి వద్దనున్న బంగారు, వెండి ఆభరణాలను దోచుకునేందుకు దారుణంగా హత్యలు చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రూరల్ ఏసీపీ పర్యవేక్షణలో తిమ్మాపూర్ సీఐ, ఎస్సైలు సిబ్బంది ఈ కేసును చాకచక్యంగా ఛేదించారు.ఈ సందర్భంగా కరీంనగర్ కమిషనరేట్లో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపి గౌస్ ఆలం వృద్ధ మహిళల అత్యకు సంబంధించిన సంఘటనల వివరాలు వెల్లడించారు.

మొదటి హత్య ఆగస్టు 16న వచ్చనూర్ గ్రామానికి చెందిన ఒంటరి వృద్ధురాలు ఉప్పులేటి భూదమ్మ (103 సం.) ఇంట్లోకి మొదటి నిందితుడు మద్దూరి సాయి తన సహచరులతో కలిసి ప్రవేశించి, ఆమెకు ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న వెండి కడియాలు, బంగారు ముక్కుపుడకలను దొంగిలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఆమె వృద్ధాప్యం కారణంగా సహజంగానే మరణించిందని భావించి అంత్యక్రియలు నిర్వహించారు. దొంగిలించిన వస్తువులను పవన్ సహాయంతో మణికంఠ అనే వ్యక్తికి విక్రయించి నగదును పంచుకున్నారని సిపి తెలిపారు.

రెండవ హత్య : అక్టోబర్ 31న జరిగింది.

తొలి హత్యలో ఎవరికీ అనుమానం రాకపోవడంతో నిందితులు మరో నేరానికి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన ఒంటరి వృద్ధురాలు ఉప్పులేటి లక్ష్మి అలియాస్ లచ్చవ్వ (80) ఇంట్లోకి చొరబడి, ఆమెను ఊపిరాడకుండా చేసి హతమార్చారు. ఆమె వద్దనున్న వెండి కడియాలు, బంగారు నల్లపూసల గొలుసు, చెవికమ్మలను అపహరించారు. వీటిలో కొన్నింటిని కరీంనగర్లో, మిగతా బంగారు నగలని హైదరాబాద్లోని ఉప్పల్ ప్రాంతంలో అమ్మి సొమ్ము చేసుకున్నారు.

నిందితుల అరెస్ట్ – రికవరీ: వృద్ధురాలి అనుమానాస్పద మృతిపై లోతుగా దర్యాప్తు జరిపిన పోలీసులు, శనివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అలుగునూర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తిమ్మాపూర్ వైపు నుంచి వస్తున్న స్కూటీని ఆపి విచారించగా ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. విచారణలో వచ్చనూర్లో జరిగిన రెండు హత్యలు తామే చేసినట్లు వారు అంగీకరించారు.

ఎక్స గ్రేషియా విడుదలపై హర్షం

-యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తినిరాజా గౌడ్



చురకలు విలేఖరి,జగిత్యాల, నవంబర్, 07 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ. 5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా పథకంలో భాగంగా మరో 32 మంది గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు మొత్తం రూ. 1.60 కోట్ల ఆర్థిక సహాయం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ. చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారని అని యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ విషయంపై రాజగౌడు మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన సాధారణ పరిపాలన (ఎన్‌ఆర్‌ఐ) శాఖ జారీ చేసిన జీఓ నెం.1603 ద్వారా ఈ ఆర్థిక సహాయానికి పరిపాలనా అనుమతి లభించింది అని అన్నారు.ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది మృతుల కుటుంబాలకు రూ. 75 లక్షలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబాలకు రూ. 85 లక్షలు,ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 1 కోటి 60 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఆమోదించింది.బత్తిని రాజా గౌడ్ తెలిపారు.2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి,తెలంగాణకు చెందిన కార్మికులు బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది.ఈ విషయంపై స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి కు గల్ఫ్ కార్మికుల పక్షాన యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 7 : జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను లారీ ఢీకొట్టడం తో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.గోదావరిఖని నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆవుల ప్రణీతను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఆమె భర్తకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు పునఃనిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



చురకలు విలేకరి, ధర్మపురి, నవంబర్ 7 : ధర్మపురి మండలం పెద్దనక్కలపేట గ్రామంలో రహదారుల దుస్థితిపై గ్రామస్థులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు వినతి ఇచ్చారు. వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారిన రోడ్లను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రహదారుల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల దుస్థితి వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.సమస్యను గుర్తించిన మాజీ మంత్రి వెంటనే ఆర్ అండ్ బీ ఎస్ఈ తో ఫోన్ లో మాట్లాడారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పెద్దనక్కలపేట గ్రామంలో రోడ్డు పునర్నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈ పర్యటనలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, జలేంధర్, తిరుపతి గౌడ్, శేఖర్, పుప్పిడి జలేంధర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుగ్గారం మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

-రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతి



చురకలు విలేఖరి,జగిత్యాల, నవంబర్ 7 : జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నర్సగౌడ్ మాట్లాడుతూ...బుగ్గారం మండల ప్రజల చిరకాల కోరిక అయిన బుగ్గారం అడ్డ రోడ్డు నుండి బుగ్గరాం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.విద్యార్థినుల భవిష్యత్తుకు ఎంతో అవసరమైన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV) శాశ్వత భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని,అలాగే భక్తుల మనోభీష్టం అయిన శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నుండి సహాయం అందించాలని మంత్రి ని కోరినట్లు నర్సాగౌడ్ వివరించారు.మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని నర్సగౌడ్ తెలిపారు.బుగ్గారం మండల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని,కార్యకర్తల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నక్క రాజయ్య, తాడెపు లింగన్న, దసర్తి పోసన్న, కేలేటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలాస వేయి లింగాల దేవాలయంలో ప్రత్యేక పూజలు

-సహస్ర లింగాలకు కుంకుమ జలాభిషేకం



చురకలు ప్రతినిధి,జగిత్యాల, నవంబర్ 7 : జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని సహస్ర లింగాల దేవాలయంలో మాస శివరాత్రి, నరకచతుర్దశి సందర్భంగా ఆలయ ఫౌండర్ చైర్మన్ నలమాసు గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం నవగ్రహాలకు ప్రత్యేక పూజలు, సహస్ర లింగాలకు కుంకుమజలంతో అభిషేకం నిర్వహించారు.ఆలయంలో శని దేవుడికి పూలతో ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం తైలాభిషేకం, మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.ఏలినాటి శని, అర్ధాష్టమ శని, శని పీడల నుండి విముక్తి కలిగించి కుటుంబాలను కాపాడాలని భక్తులు శనిదేవుడిని వేడుకున్నారు.సహస్ర లింగాలకు నిర్వాహకులు, భక్తులు, ప్రత్యేకంగా కుంకుమ జలంతో అభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. భక్తులందరూ స్వామి వారికి అభిషేకించి మంగళ హారతులు ఇచ్చారు. భక్తులందరికీ బ్రాహ్మణులు ఆశీర్వాదించి తీర్థ ప్రసాదం అందజేశారు.అలాగే జగిత్యాల సమీపంలో గల సూర్య దస్వశేతరి ఆలయంలో సుప్రభాత సేవా, విశ్వక్సేన ఆరాధన,స్వామివారికి అభిషేకం,కార్తీక దీపం అఖండ నవ జ్యోతుల ప్రజ్వలన, విష్ణు చరిత్ర సప్తహ పారాయణం గ్రంధం ఆవిష్కరణ, అస్టాదశ శక్తిపీఠం కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని మార్కండేయ దేవాలయం, శివాలయం, విద్యానగర్ రామాలయం వద్ద నవగ్రహాలకు భక్తులు పూజలు చేసి శని దేవుడికి నువ్వుల నూనెతో అభిషేకించారు.ఈ సందర్భం గా పొలాస సహస్ర లింగాల ఆలయ ఫౌండర్ చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం,ఆనందం, ఐశ్వర్యంతో పాటు సమస్యల నుండి విముక్తి కలగాలని,శుభం కలగాలని కోరుకున్నట్లు తెలిపారు.వివాహం కాని వారికి తొందరగా వివాహం జరగాలని, సంతానం కాని వారికి సంతానం కలగాలని,గ్రహపిడలు తోలగాలని, ఆరోగ్యం,ఐశ్వర్యశే,కలగాలని ఐశ్వరుడిని వేడుకున్నట్లు గంగాధర్ వివరించారు. తప్పకుండా పార్వతీ పరమేశ్వరుడు భక్తుల కోరికలు తీరుస్తాడని చెప్పారు.ఈ కార్యక్రమాల్లో కొయ్యడ రమేష్, జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, డాక్టర్ వడ్ల గట్ట రాజన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ మొండ్రాల శ్రీనివాస్,- లత, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, సహాయ కోశాధికారి గోప-స్వాతి, భారతాల రాజసాగర్- గీత, మురళి, దేవదాస్ తో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

20లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



చురకలు విలేకరి, ధర్మపురి, నవంబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో రైతాంగం నష్టపోతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో సాగునీరు అందక ఎండిపోతున్న వరి, పత్తి పొలాలను ఆయన పరిశీలించారు. రైతులు మండల లింగయ్య, భీమయ్య, చంద్రయ్యలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 400 కోట్లతో ఆర్ఎఫ్ఎల్ నుంచి ముత్తూరు వరకు 14 లిఫ్టులు ఏర్పాటు చేశామని, అందులో దొంతాపూర్ లిఫ్ట్ ఒకటన్నారు. గత 6 నెలలుగా ఇక్కడ 2-3 మోటార్లు చెడిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గోదావరి పక్కనే ఉన్నా నీరందక పంటలు ఎండిపోవడం బాధాకరమన్నారు. స్థానిక మంత్రి ఇక్కడే ఉన్నా రైతుల కష్టాలను గాలికొదిలేశారని, సమస్య చెబితే కలెక్టర్ వద్దకు వెళ్లమనడంబాధ్యతారాహిత్యమని విమర్శించారు. దొంతాపూర్ రోడ్డు అధ్వాన్నంగా ఉందని, గతంలో మంజూరైన 32 కోట్ల రోడ్డు పనులు చేయించలేకపోతున్నారన్నారు. ఎల్ నినో ప్రభావం తెలుసి కూడా ముందస్తు చర్యలు తీసుకోలేదని, గోదావరిలో నీరు ఉన్నా కన్నెపల్లి నుంచి ఎత్తిపోతలు చేపట్టలేదన్నారు. ఏ పంట వేయకండి అని సీఎం, మంత్రులు ప్రచారం చేయడం వల్లే 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. రాష్ట్రంలో 661 మండలాలకు గాను 365 కరువు మండలాలు ప్రకటించినా ఆర్థిక సహాయం ఇవ్వలేదని, మూడో పంట రైతుబంధు, రైతుభీమా అమలు కావడం లేదన్నారు. కాళేశ్వరం పిల్లర్లు రిపేర్ చేస్తే సస్యశ్యామలం అవుతుందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ నాయకత్వం వస్తేనే రైతులకు దిక్కని, ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, సంగి శేఖర్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహం శిబిరం



చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 7 : రాయికల్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహం,బిపి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.76 మందికి ఉచితంగా షుగర్,బీపీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం షుగర్ వ్యాధిని అదుపు చేసుకునేందుకు పలు వైద్య సూచనలు అందించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, షుగర్, బీపీ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ కనపర్తి శ్రీనివాస్,క్లబ్ సభ్యులు మ్యకల రమేష్,మచ్చ శేఖర్, దాసరి గంగాధర్,కొయ్యడి మహిపాల్ రెడ్డి,సామల్ల సత్యనారాయణ, సంకోజి అశోక్,కుర్మ సుదర్శన్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్, ఆర్.ఎం.పి. కట్కం శ్రీనివాస్, వాసం గోవర్ధన్, కౌన్సిలర్ పుర్రె శ్రీధర్, తురగ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



చురకలు విలేకరి, గొల్లపల్లి, నవంబర్ 7 : గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి చెందిన జక్కుల రామేశ్వరి క్యాన్సర్‌తో అలాగే చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేష్ డెంగ్యూ జ్వరంతో మరణించగా శంకర్ రావు పెట్ గ్రామానికి చెందిన ఎడమల భోజేందర్ రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించారు.అలాగే ఆర్థిక పరిస్థితి దృష్ట్య ఇరు కుటుంబాలకు చెరో రూ.5వేల ఆర్థిక సహాయం అందించి ఆయా కుటుంబాలకు మనోధైర్యం అందించారు.ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు అవారి చందు,చిల్వకోడూర్ సర్పంచ్ దాసరి తిరుపతి,మాజీ సర్పంచ్ అలిశెట్టి రవీందర్ బూసరపు సిద్ధూ,మొగిలి,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల సిండికేట్‌కు అడ్డుకట్ట వేయాలి

-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి డిమాండ్



చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, నవంబర్ 7 : రైతులు పండించిన సన్నవడ్లకు సరైన ధర లభించడం లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మెట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.2,500 నుంచి రూ.2,700 మాత్రమే చెల్లిస్తుండగా, నిజామాబాద్ జిల్లాలో రూ.3,700 నుంచి రూ.4,200 వరకు ధర లభించిందని తెలిపారు. దళారులు సిండికేట్‌గా ఏర్పడి క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ ప్రభుత్వం వెంటనే దళారులపై చర్యలు తీసుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.

సౌదీ నుంచి స్వగ్రామానికి చేరుకున్న గల్ఫ్ కార్మికుడు

-వలస కార్మికుడికి అండగా నిలిచిన సాటా రియాద్,
-సీఎం ప్రవాసీ ప్రజావాణి విజ్ఞప్తి చేసిన 40 రోజుల్లోనే సురక్షితంగా స్వదేశానికి రాక



చురకలు విలేఖరి,నిజామాబాద్, నవంబర్, 07 : నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రానికి చెందిన ఎలిగేటి రంజిత్ కుమార్ సౌదీ అరేబియా నుంచి సురక్షితంగా స్వగ్రామానికి చేరుకున్నారు. సీఎం ప్రవాసీ ప్రజావాణి, జీఏడీ ఎన్నారై విభాగం, సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా), రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం సమన్వయంతో ఆయన స్వదేశీ పునరాగమనం సాధ్యమైంది.రంజిత్ కుమార్ 2024 మార్చి 16న వర్క్ వీసాపై సౌదీ అరేబియాలోని రియాద్‌కు వెళ్లి ఒక కంపెనీలో క్లీనర్‌గా ఉద్యోగంలో చేరారు. రెండున్నర సంవత్సరాలకు పైగా పనిచేసినప్పటికీ, ఉద్యోగ ఒప్పందం ప్రకారం తనకు రావాల్సిన వేతనంతో కూడిన సెలవులను కంపెనీ మంజూరు చేయలేదు. అంతేకాకుండా వీసా, ఇఖామా (నివాస గుర్తింపు కార్డు) రెన్యువల్ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో ఆయన అక్కడే చిక్కుకుపోయారు. రియాద్ లో వున్నా సాటా రియాద్ అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చను సప్రదించారు.భారతదేశములో వున్నా తన సోదరుడిని మాట్లాడి తెలంగాణా లో వున్నా ప్రజావాణి ని కలిసి రంజిత్ కుమార్ ను స్వదేశానికి రప్పించేందుకు తెలంగాణా ప్రజావాణి ని కోరాలని రియాద్ అధ్యక్షులు తెలియజేశారు.సహాయం చేయాలని కోరుతూ తమ్ముడు రోహిత్ ఆగస్టు 11న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సీఎం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.ఈ ఫిర్యాదు పై స్పందించిన సీఎంప్రవాసీ ప్రజావాణి బృందం, జీఏడీ ఎన్నారై విభాగం, సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) రియాద్ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేస్తూ రంజిత్‌ను స్వదేశానికి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఫలితంగా సెప్టెంబర్ 20న రంజిత్ కుమార్ సురక్షితంగా మాతృభూమికి చేరుకున్నారు.సీఎం ప్రవాసీ ప్రజావాణి బృందానికి మరియు సాటా రియాద్ అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చకు, మహిళా అధ్యక్షులు శరవాణి విద్యాధరణి, ఫౌండర్ మల్లేశన్ కు మరియు రియాద్ కోర్ టీమ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన రంజిత్.సౌదీ అరేబియా నుంచి స్వగ్రామానికి చేరుకున్న రంజిత్ కుమార్, మంగళవారం హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ఉన్న సీఎం ప్రవాసీ ప్రజావాణి వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డిలను కలిసి తాను వాపస్ రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ తనీష్ ముసుగోటి, వాలంటీర్లు మహ్మద్ బషీర్ అహ్మద్, జయశ్రీ గూడూరి, స్వదేశ్ పరికిపండ్ల, సాటా ప్రతినిధి కె.పి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బస్సు బస్టాండ్‌లో ఆగాల్సిందే



-బిజెపి నాయకుల డిమాండ్
-డిపో మేనేజర్‌కు వినతి పత్రం

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 7 : హుజూరాబాద్ పట్టణ ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం నాన్‌స్టాప్ బస్సులను హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆపాలని హుజూరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు అన్నారు.శనివారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ బి ఏంజెల్ కు బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హుజూరాబాద్ పట్టణం విద్యా, వ్యాపార, వైద్య అవసరాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కీలక కేంద్రంగా ఉందని, ప్రతిరోజూ అనేక మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని అన్నారు.నాన్‌స్టాప్ బస్సులు హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆగకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా అత్యవసర పనులపై వెళ్లేవారు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. హుజూరాబాద్ మీదుగా ప్రయాణించే నాన్‌స్టాప్ బస్సులకు బస్టాండ్‌లో నిర్దిష్ట స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నాన్‌స్టాప్ బస్సులను హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆపేలా చర్యలు తీసుకొని, ప్రయాణికుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించక నాన్ స్టాప్ బస్సులను హుజూరాబాద్లో ఆపకపోతే బిజెపి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు,సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ సబ్బని రమేష్ , తిప్ప బత్తిని రాజు, గంట సంపత్, నరాల రాజశేఖర్ ,కొలిపాక శ్రీనివాస్, వాసు, శ్రీధర్, కుమార్ స్వామి, సంతోష్, అనిల్, కే.పవన్, బొడిగే రాధ, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగు చేపట్టాలి



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్ పూర్ నవంబర్ 7 : రామగిరి మండలం లో రైతులు పారుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి రైతులను కోరారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, కేవీకే శాస్త్రవేత్త వినోద్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉండటంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నీటి వినియోగాన్ని తగ్గిస్తూ పెసలు, నువ్వులు, మినుములు, కుసుమలు వంటి ఆరుతడి పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని సూచించారు.అలాగే ఆయిల్‌పామ్ సాగు విధానాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలని కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు రైతులకు సులభంగా అందుబాటులో ఉండేలా ఫెర్టిలైజర్ డీలర్ల వద్ద వాటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు పశువుల మేత సాగు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందని, పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణ సౌకర్యం కూడా ఉందని వివరించారు.ఇంకుడు గుంతల నిర్మాణం,వాటి ఉపయోగాలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు.రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ అరవింద్, పీఏసీఎస్ డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన ఓసిపి 1

-కార్మికులకు అభినందనలు తెలిపిన అధికారులు
-సంతోష సభలో సంబరాలు



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ నవంబర్ 7 : అన్ని రంగాల్లో ముందు ఉండటం ఉద్యోగుల కృషి, నైపుణ్యానికి నిదర్శనం.జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్న గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా ఇచ్చే స్టార్ రేటింగ్ అవార్డులలో సింగరేణి సంస్థలోని సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియా ఓపెన్ కాస్ట్ మైన్ నం.1 వరుసగా మూడోసారి(హ్యాట్రిక్) ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి రికార్డు సృష్టించడం అభినందనీయం.బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తారు. కేంద్ర బొగ్గు శాఖ పరిశీలక బృందం ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతుంది. 100 మార్కులకు 91కి పైగా మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డును ఈ నెల 2వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ కేంద్ర మంత్రివర్యుల చేతుల మీదుగా కోల్ ఇండియా మరియు సింగరేణి సంస్థ చైర్మన్ సమక్షంలో అందుకున్నారు. ఇది మనకు గర్వకారణం. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సింగరేణి సంస్థలోని అత్యుత్తమ ఓపెన్ కాస్ట్ గనిగా అన్ని రంగాల్లో ముందు ఉండటం ఉద్యోగుల కృషి, నైపుణ్యానికి నిదర్శనం.

శనివారం సంతోష సభ

అవార్డు అందుకున్న షీల్డ్, ప్రశంసా పత్రాలను శనివారం ఉదయం గని ఆపరేషన్ సైట్ ఆఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రదర్శించి కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, గని ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వి. ఫాటింగ్, గని మేనేజర్ రావుల పాపయ్య ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎం.ఆర్.సి. రెడ్డి, అధికారుల సంఘ ప్రతినిధి, సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్ గౌడ్, ఏరియా అధికారులు మురళీకృష్ణ, గని ప్రాజెక్ట్ ఇంజనీర్ జ్ఞాన సంబంధన్, రక్షణ అధికారి అజయ్ కుమార్, సర్వే అధికారి రవీందర్ లతో పాటు గని అధికారులు, సూపర్ వైజర్లు, కార్మికులు పాల్గొని సంబరాలలో మునిగి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ఓసీ-1 రికార్డులను కాపాడుకుంటూ, 50 ఏళ్ల పూర్తి చేసుకున్న గని చిన్న గనిగా ఉన్నప్పటికీ, ప్రణాళికలో భాగంగా ఓబీ, కోల్ ఉత్పత్తిని భద్రతతో కూడిన ఉత్పాదకతతో సాధించాలని, ఇదే సంతోషాన్ని కొనసాగేలా అందరం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.

పాత నేరస్థులపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా

-రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు.. ప్రస్తుత కార్యకలాపాలపై ఆరా
-జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా నిరంతర ఆకస్మిక తనిఖీలు
-తరచూ నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 07 : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్థులపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి వేళల్లో పాత నేరస్థుల వద్దకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈతనిఖీల్లో భాగంగా పాత నేరస్థులు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, ఏం చేస్తున్నారు, వారి ప్రస్తుత కార్యకలాపాలు ఏమిటి, ఎవరితో సంబంధాలు కలిగి ఉన్నారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీసి,తిరిగి నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలలో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ...జిల్లాలో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా తిరిగి నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా

జువ్వాడి బాధ్యతల స్వీకారం

-శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 07 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు శనివారం హైదరాబాద్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. మైత్రి వనం హెచ్ ఎం డీ ఏ రెండో అంతస్తులో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం హకీంపేటలోని జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు కుమారుడైన నర్సింగరావు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పార్టీ బలోపేతానికి చేసిన కృషి, అంకితభావానికి గుర్తింపుగా వెలమ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు. నూతన బాధ్యతల్లో నర్సింగరావు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థుల అవగాహన ర్యాలీ



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 07 : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చాటుతూ జమ్మికుంట న్యూ మిలీనియం పాఠశాల విద్యార్థులు వీణవంక ఎంపీడీవో కార్యాలయం నుండి ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని "ప్లాస్టిక్ వాడకం ఆపుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం", పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ... భావి భారత పౌరులైన విద్యార్థులు ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు రావాలని, ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వాడేలా అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముసిపట్ల తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ వరుణ్ రెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్, శ్రీనివాస్, శారద, అఖిల, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపం ఆకృతిలో విద్యార్థులు

-ఆకట్టుకున్న పినాకిల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన



చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట నవంబర్ 07 : ఆదివారం జరగబోయే దీపావళి పర్వదినం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుమాల బైపాస్ రోడ్డులో గల పినాకిల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు దీపం ఆకృతినీ ప్రదర్శించారు. ఈ ఆకృతి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మహమ్మద్ ఖైస్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్ మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంజనేయులును సన్మానించిన సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 07 : ఎల్లారెడ్డిపేట మండల విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఆంజనేయులును సిరిసిల్ల డిఎస్పి నాగేంద్రచారి శనివారం అభినందించి శాలువా కప్పి సన్మానించారు. సంఘ అభివృద్ధి కోసం సేవలు చేయాలని పేరు ప్రతిష్టలు పొందాలని ఆంజనేయులుకు డిఎస్పి నాగేంద్ర చారి సూచించారు.ఆత్మీయ మిత్రునికి సన్మానం ఎల్లారెడ్డిపేట మండల విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైనటువంటి కొత్తపెల్లి ఆంజనేయులు గారిని గుండాడి వెంకట్ రెడ్డి గారి నివాసంలో ఆత్మీయ మిత్రులు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కంచర్ల పరుశరాములు, గుండాడి వెంకట్ రెడ్డి, గాజుల దేవదాస్, తదితరులు ఉన్నారు.

బండలింగంపల్లిలో వీబీజీ రామ్‌జీ పథకంపై అవగాహన సదస్సు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 07 : ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో వీబీజీ రామ్‌జీ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సత్తయ్య గారు, ఏపీవో కొమురయ్య గారు హాజరై గ్రామ ప్రజలకు పథకానికి సంబంధించిన వివరాలు, పనుల అమలు విధానం మరియు ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సయ్య గౌడ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు మరియు ఇతరులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 07 : వచ్చునూరు గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన ఉప్పులేటి లచ్చవ్వ గారి కుటుంబానికి శ్రీగిరి రంగారావు 50కిలోల బియ్యం వితరణ చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ,అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు హసన్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి రాజు,గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పులేటి అనిల్,వచ్చునూరు గ్రామ ఉపసర్పంచ్ తాళ్లపల్లి మనోహర్, వార్డు సభ్యులు ఉప్పులేటి శంకర్, మాజీ ఉపసర్పంచ్ లు వడ్డే లక్ష్మారెడ్డి, అందె రాజమౌళి, కాంగ్రెస్ నాయకులు వడ్లకొండ రామచంద్రం, వడ్లకొండ శివ శంకరయ్య, నాయకులు అందే శ్రీనివాస్, శ్రీగిరి సత్తయ్య, ఉప్పులేటి సహదేవ్ , కొత్తగాటు రాజమల్లు, అజార్, శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హుజూరాబాద్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

-పలు దుకాణాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధం



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 7 : హుజూరాబాద్ పట్టణంలోని ఉస్మాన్ సేట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అకస్మాత్తుగా వోల్టేజ్ ఫ్లక్చువేషన్స్ కారణంగా షార్ట్ సర్క్యూట్ సంభవించి,పలు దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి.'ఇమ్రాన్ ఫ్లవర్ మర్చంట్' షాపులో సీసీ కెమెరాలు, టీవీ, ఫ్యాన్లు కాలిపోయి సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లింది. వ్యాపారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పాత వైరింగ్ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆరోపిస్తూ విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్కంఠ రేపుతున్న హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు

-కెప్టెన్‌ను కలిసిన మల్లారెడ్డి, ప్రభాకర్ రావు ప్యానెల్ కెప్టెన్ తో పాటు ప్రణవ్ ను కలిసిన నారాయణరెడ్డి ప్యానెల్



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 7 : హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో కార్యదర్శి (సెక్రటరీ) పదవికి పోటీ చేస్తున్న కట్కూరి మల్లారెడ్డి, వైస్ చైర్మన్ (ఉపాధ్యక్షుడు) పదవికి పోటీ చేస్తున్న పుల్లూరి ప్రభాకర్ రావుల ఆధ్వర్యంలో 13 మంది అభ్యర్థుల ప్యానెల్ హన్మకొండలోని హంటర్ రోడ్డులో ఉన్న క్లబ్ ఫౌండర్, మాజీ ఎంపీ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్లబ్ ఎన్నికల్లో తమకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, కొత్తగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. క్లబ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, సమాజ సేవలను మరింత విస్తరించి హుజురాబాద్ క్లబ్‌ను అన్ని రంగాల్లో ముందంజలో నిలుపు తామని నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్ రావు కెప్టెన్‌కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శి అభ్యర్థి మంద (ఆర్రే) రమేష్, కోశాధికారి అభ్యర్థి తాడికల్ సీను, కార్యవర్గ సభ్యత్వ అభ్యర్థులు కేసిరెడ్డి నర్సింహారెడ్డి, గడ్డం ధర్మారెడ్డి, మాగంటి శ్రీధర్, విష్ణుదాసు గోపాల్ రావు, మేకల రాజిరెడ్డి, బత్తుల సమ్మయ్య, జన్నోజు రాజేందర్, పొనగంటి శ్రవణ్ కుమార్, ఆకినపల్లి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు. వీరికి మద్దతుగా ఎర్రం నారాయణ రెడ్డి, అడ్వకేట్ వీర సేనారెడ్డి, వర్ధినేని రవీందర్ రావు, బండ శ్రీనివాస్ తదితరులు కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో ఎన్నికల అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ప్రణవ్ తో పాటు కెప్టెన్ ను కలిసిన నారాయణరెడ్డి ప్యానల్

ఇదిలా ఉంటే హుజురాబాద్ క్లబ్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మరోవైపు పోటీలో ఉన్న ముచ్చ నారాయణ రెడ్డి, శివనాథుని వేణు, కొండ గణేష్, న్యాయవాదులు కంకణాల విజయ రెడ్డి భగవాన్ రెడ్డి కళ్యాణ్ పుల్లూరి శ్రీకాంత్ గోలి సురేష్ ఈదుల కంటి రవీందర్ రెడ్డి తదితరులు మొదట సింగపురంలో కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ తో పాటు హనుమకొండలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.వారి మద్దతును కోరారు.రాజకీయాలకు అతీతంగా క్లబ్ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. క్లబ్ ఎన్నికల సందర్భంగా పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలు,సమీకరణలు జరుగుతున్నాయి. అయితే ఒక దశలో కొందరు ఏకగ్రీవానికి, సయోధ్యకు ప్రయత్నించినప్పటికీ ఎవరు పోటీ నుండి ఉపసంహరణకు ఒప్పుకోలేదు. దీంతో ఎన్నిక అనివార్యం అవుతోంది. ఈనెల 15న ఎన్నికలు జరగనున్నాయి. హుజురాబాద్ క్లబ్ ఎన్నికల నేపథ్యంలో సర్వత్ర ఉత్కంఠ నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డుకు ఆర్థిక సాయం



-మానవతా దృక్పథంతో స్పందించిన సీపీ గౌస్ ఆలం
-హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కు అందజేత

చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, నవంబర్ 7 :

విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై చేయి విరిగిన సైదాపూర్ పోలీస్ స్టేషన్ డ్రైవర్, హోంగార్డు ఎండీ ముజీబ్‌కు పోలీస్ శాఖ అండగా నిలిచింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మానవతా దృక్పథంతో స్పందించి, హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ. 40,000/- నలభై వేల రూపాయల ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు.ఈ నెల 2న సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు ముగించుకుని హోంగార్డు ఎండీ ముజీబ్ తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, మెట్టుపల్లి వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన చేయి విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీ గౌస్ ఆలం వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన వైద్య ఖర్చుల నిమిత్తం వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం ప్రకటించారు.కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం హోంగార్డ్ ఆర్ఐ జానీమియా ఆధ్వర్యంలో బాధితుడు ఎండీ ముజీబ్‌కు రూ. 40 వేల చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి కష్టం వచ్చినా పోలీస్ కమిషనరేట్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. తన కష్ట సమయంలో తక్షణమే స్పందించి ఆర్థిక భరోసా కల్పించినందుకు హోంగార్డు ఎండీ ముజీబ్ సీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ



చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 07 : మల్లాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందినటువంటి పంతంగి వీరవ్వ,తుమ్మల వీరయ్య గార్లు ఇటీవల మరణించడం జరిగింది.మల్లాపూర్ గ్రామ ఉపసర్పంచ్ రాగుల పర్శరాములు గౌడ్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం బస్తాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్ కర్ణబత్తుల మనోహర్, తాళ్లపల్లి సందకిషోర్, సానగొండ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్



చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 07 : మల్లాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గారి పిలుపు మేరకు ఈ రోజు ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో ఉపసర్పంచ్ రాగుల పర్శరాములు గౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు యాళ్ల సుధాకర్ రెడ్డి వార్డు మెంబర్లు కర్ణబత్తుల మనోహర్, పంచాయతి కార్యదర్శి ప్రసాద్ గారు తదితరులు పాల్గొనడం జరిగింది.

తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్‌ను సమాజంలో బలోపేతం చేయండి

-ఇస్లాం ముసుగులో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి
-ఖాధియాని, షకిలియత్ వర్గాల బారిన పడి మోసపోకండి
-గ్రామీణ ప్రాంత ముస్లింల ఈమాన్ విశ్వాసాన్ని కాపాడే యజ్ఞంలో భాగస్వామ్యులు కండి
-ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు




కరీంనగర్, నవంబర్ 07 : ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని, షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి, వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో కశ్మీర్ గడ్డలోని ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బేసిక్ ఆఫ్ ఇస్లాం అనే అంశంపై ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్టు నిర్వహించగా,గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మౌలానా అర్షద్ అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించకుంటే ముస్లిం కాలేడని, విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు.ఇజ్రాయిల్, ఆంగ్లేయుల కనుసన్నల్లో భారత దేశంలో ఖాధియాని వర్గం పేరిట, షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ,ముస్లింల ముసుగులో, వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముస్లిం యువత ఇస్లాం గురించి పూర్తి స్థాయిలో తెలియకుండా ఖాధియాని, షకిలియత్ వర్గాలు ముస్లిం గురువులు, పండితులని నమ్మి,వారిబారిన పడి, ఇస్లాం,ఈమాన్ నుండి తమంతట తాము బహిష్కృతులు అవుతున్నారని, ఇంత పెద్ద ఘటన ఇది వీరికి తెలియకుండానే జరిగిపోతుందన్నారు. ఖాధియాని,షకిలియత్ వర్గాలను స్వీకరించి,వారు చెప్పిన బాటలో నడుస్తూ జీవితం గడిపి, ఒకవేళ మరణిస్తే కాఫీర్ గానే పరిగణించబడుతారని, ఖయామత్ ప్రళయదినం రోజు లేపబడుతారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలను చేరదీసి, వారి ఈమాన్ విశ్వాసాన్ని కాపాడేందుకు మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు చేస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ తమ విధిగా, బాధ్యతతో పాలుపంచుకొని,తోడ్పాటు నందించాలని కోరారు.ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల, ఈమాన్, విశ్వాసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు.ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్‌కు కరీంనగర్ నగర ముస్లిం సమాజం అండగా నిలబడి,మజ్లిస్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టులో తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి,అమాయక గ్రామీణ ముస్లింలను ఇస్లాం నుండి మరలిపోకుండా కాపాడే యజ్ఞంలో మహమ్మద్ ప్రవక్త అనుచరులుగా మనసా,వాచా,ఖర్మనా సేవలు అందించాలని పిలుపు నిచ్చారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో హఫీజ్ వసిముద్దీన్, మౌలాన కాజిమ్, మౌలాన నయిమ్,హాఫిజ్ రిజ్వాన్,హాఫిజ్ సాధక్ అలీ,ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు హాఫిజ్ అహ్మద్ హిష్జి, కలిమ్ షరీఫ్,హాఫిజ్ ఫరిదోద్దీన్,హాఫిజ్ అబ్దుల్ రాఫె,హాఫిజ్ తౌహీద్,హఫీజ్ ఇమ్రాన్ బేగ్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

-నీరు,విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలి
-కళాశాల ప్రిన్సిపల్ ఆసం సంజీవ్



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (07) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఎల్‌నినో ప్రభావాలు, భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో వాతావరణంలో మార్పులు సంభవించి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, దీంతో ఎండ తీవ్రతతో పాటు నీటి కొరత, విద్యుత్ కొరత వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయని కళాశాల ప్రిన్సిపల్ ఆసం సంజీవ్ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో తలెత్తే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీటిని, విద్యుత్తును అవసరమైన మేరకే వినియోగించాలని, వృథాను పూర్తిగా అరికట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.విద్యార్థులు కళాశాలలో తెలుసుకున్న ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, నీటి కొరత నివారణ చర్యల గురించి ఇంటి వద్ద తల్లిదండ్రులతో చర్చించాలని, వారికి కూడా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల ద్వారా సమాజంలో నీటి, విద్యుత్ పొదుపుపై చైతన్యం తీసుకురావడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్ కుమార్, అధ్యాపకులు రతన్ సింగ్, నియాజ్, నాగరాజు, ప్రేమ్ కుమార్, మధు, మురళి, నిఖిల్, చందు, అనూష, రజితతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కాట్రపల్లిలో పేకాటరాయుళ్ల అరెస్ట్



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 7 : హుజూరాబాద్ మండలం లోని కాట్రపల్లి గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరం పై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. కాట్రపల్లి శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాట్రపల్లి గ్రామంలోకొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట స్థావరం ఏర్పాటు చేసి జూదం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడి చేపట్టారు. సంఘటనా స్థలంలో పేకాడుతూ పట్టుబడ్డ తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.11,400 నగదుతో పాటు 9 సెల్‌ఫోన్లు,5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

అల్లం బుచ్చమ్మకు ప్రముఖుల ఘన నివాళి



చురకలు ప్రతినిధి మంథని, నవంబరు 7: అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ కవులు, రచయితలు, జర్నలిస్టు సోదరుల తల్లి కామ్రేడ్ అల్లం బుచ్చమ్మకు పలువురు ప్రముఖులు శనివారం నివాళులర్పించారు. మంథని, రామగుండం మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, కోరుకంటి చందర్, ఏపీఎంసీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీయూఎస్ ఆర్టీసీ రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్, నేత రవి, న్యాయవాది ఇనుముల సతీష్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు బాలసాని రాజయ్య తోపాటు పలువురు బుచ్చమ్మ పార్థివ దేహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు.అంత్యక్రియలకు హాజరైన అల్లం సోదరులు రాజయ్య, వీరయ్య, నారాయణలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బుచ్చమ్మ శుక్రవారం కన్నుమూశారు. వారి స్వగ్రామమైన మంథని మండలంలోని గాజులపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గంట చక్రపాణి, కల్లు గీత మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే. శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్,, కోశాధికారి యోగానంద్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్, సీనియర్ జర్నలిస్టులు అవ్వారి భాస్కర్, కందుకూరి రమేష్ బాబు, గొర్ల బచ్చన్న, బీ ఆర్ లెనిన్, చెల్మల సుధాకర్, తిరుపతి నాయక్, లాయక్ పాషా, అంకరి ప్రకాష్, ఎలగందుల రవీందర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ చట్టం అమలు ఉత్తర్వులపై సీఎంకు కృతజ్ఞతలు



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 07 : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని నివాసంలో శనివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నేతృత్వంలో మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని ఉద్యోగుల పదోన్నతుల్లో అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

-ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రమాదాలకు తావివ్వకూడదు
-జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచనలు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, నవంబర్ 07 : దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పాటు పూర్తి భద్రతా జాగ్రత్తలు పాటిస్తూ జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచించారు. బాణసంచా కాల్చే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..పండుగ సమయంలో టపాసులు కాల్చే ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని,రోడ్లపై తొందరపాటు, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగించ కూడదని తెలిపారు. దీపావళి వేడుకల్లో చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ కోరారు. సురక్షితమైన,పర్యావరణహిత బాణసంచాను మాత్రమే వినియోగించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో ఇతరులకు ఇబ్బందులు, ప్రమాదాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఒకరి ఆనందం మరొకరికి ప్రమాదంగా మారకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను పాటిస్తూ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా, ప్రమాదరహితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఎస్పీ మహేష్ బి. గీతే విజ్ఞప్తి చేశారు.

సోషల్ మీడియా ఆన్‌లైన్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
-సీఐ ఓదెల వెంకటేష్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 07 : దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓదెల వెంకటేష్ సూచించారు.ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల ప్రజలకు ఆయన ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భం గా సీఐ మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నపిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ఇళ్ల సమీపంలో బాణసంచా కాల్చకుండా జాగ్రత్త పడాలని తెలిపారు.టపాసులు కాల్చేటప్పుడు నీళ్లు,ఇసుక అందుబాటు లో ఉంచుకోవాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సోషల్ మీడియాలో వచ్చే గుర్తుతెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.ఉచిత బహుమతులు, నగదు ఆఫర్లు, బ్యాంకు ఖాతా వివరాలు అప్‌డేట్ చేయాలంటూ వచ్చే అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఇలాంటి లింకుల ద్వారా వ్యక్తిగత, బ్యాంకు వివరాలను సేకరించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద సందేశాలు, లింకులను ఇతరులకు పంపించవద్దని తెలిపారు.దీపావళి పండుగను సురక్షితంగా,సంతోషంగా జరుపుకోవాలని సీఐ ఓదెల వెంకటేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

శరీర దాన అంగీకార పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేసిన

రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొంకూరి గంగారావు



చురకలు ప్రతినిధి జగిత్యాల నవంబర్ 07 : జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొంకూరి గంగారావు తన మరణానంతరం దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించడానికాను శనివారం జగిత్యాల వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుభాష్ కు మరియు అనాటమీ విభాగానికి తన అంగీకార పత్రాన్ని అందజేసి, శరీరదాతగా వైద్య కళాశాలలో పేరు నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో శరీర దానం కోసం అంగీకారం తెలిపిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొంకూరి గంగారావుకృష్ణశీ పాటుగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సుభాష్, జగిత్యాల రోటరీ క్లబ్ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ సిరిసిల్ల శ్రీనివాస్, క్రిటికల్ కేర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా, శ్రీపతి, అనాటమీ విభాగం వైద్యులు డా. శ్రీనివాస్ ఉన్నారు.శరీరదాన నిర్ణయం గురించి గత కొద్దిరోజులనుండి ఆలోచించి, తన కుటుంబ సభ్యులకు ముందుగానే తెలియజేయడం జరిగిందని ఈ సందర్భంగా గంగారావు వివరించారు.శరీర దానం ద్వారా మానవ శరీర నిర్మాణాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్న ఉద్దేశ్యంతో, తాను నిర్ణయించుకుని అంగీకార పత్రం అందజేయడం జరిగిందని, శరీర దానంపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, వైద్య విజ్ఞానంకు తోడ్పాటునందించాలని గంగారావు కోరారు.కాగా, శరీర దానం అంగీకార పత్రం అందజేసినందుకుగాను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సుభాష్... దానపత్రం అందజేసిన బొంకూరి గంగారావు కు , సహకరించిన జగిత్యాల రోటరీ క్లబ్ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ సిరిసిల్ల శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.శరీరదానం అనేది వ్యక్తి స్వచ్ఛంద నిర్ణయం. అయితే, మరణం సంభవించినప్పుడు శరీరాన్ని సమయానికి సంబంధిత మెడికల్ కాలేజీకి అందించేందుకు కుటుంబ సభ్యులకు ముందస్తు సమాచారం ఉండటం చాలా ముఖ్యమనీ, వారి సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సుభాష్ వివరించారు.శరీరదానం గురించి సమాజంలో ఇంకా అనేక సందేహాలు, అపోహలు ఉన్నాయనీ.... సంప్రదాయాలు, కుటుంబ విశ్వాసాలు, అంత్యక్రియలపై అందోళనల వల్ల కొందరు వెనుకడుగు వేస్తారనీ, అందువల్ల వైద్య నిపుణులు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించాలని కోరారు.

చురకలు కథనానికి స్పందన



-స్మశానంలో బతుకుతున్న తల్లీ కొడుకుకు బండి సంజయ్ ఆర్థిక భరోసా
-రాకేష్ వైద్య ఖర్చుల కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత
-మెరుగైన వైద్యం అందిస్తామని హామీ

చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, నవంబర్ 07 : 'బతికుండగానే స్మశానంలో బతుకులు' అనే శీర్షికతో చురకలు తెలుగు దినపత్రికలో ప్రచురితమైన హృదయవిదారక కథనానికి స్పందన లభించింది. అనారోగ్యంతో బాధపడుతున్న కన్న కొడుకును కాపాడుకునేందుకు రూ. 10 లక్షల వరకు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుటపడక, ఇంటి అద్దె చెల్లించలేని దుస్థితిలో స్మశానవాటికలో నివసిస్తున్న తల్లి అమృత, ఆమె కుమారుడు రాకేష్ దీనగాథపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన మరిపెల్లి రాకేష్ (34) తీవ్ర పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతూ సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుమారుడి వైద్యం కోసం ఉన్నదంతా ఖర్చు చేసిన తల్లి అమృత ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం అరుణప్రభ కథనం ద్వారా వెలుగులోకి వచ్చింది.ఈ కథనంపై స్పందించిన బండి సంజయ్ కుమార్ రాకేష్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆయన పంపించిన నగదును బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి శనివారం ఆసుపత్రి లో బాధిత కుటుంబానికి అందజేశారు .ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ పేదరికంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న రాకేష్ కుటుంబానికి బండి సంజయ్ అందించిన సహాయం కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. రాకేష్‌కు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి రాకేష్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. రాకేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమ దీనస్థితిని వెలుగులోకి తీసుకువచ్చిన అరుణప్రభ కథనానికి స్పందించి ఆర్థిక సహాయం అందించిన బండి సంజయ్ కుమార్‌కు, సహాయం అందజేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య,చందుర్తి మండల అధ్యక్షుడు మోకిలి విజయేందర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తదితర బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫాం పాండ్ నిర్మాణంలో నీటి ఊట



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 07 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామ సమీపంలో గుట్టక్రింద ఆంజనేయస్వామి ఆలయం ప్రక్కన్న వీబిజి రాంజీ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీల ఫాంపౌండ్ నిర్మాణపనుల్లో వింత చోటుచేసుకుంది.ఈ పనుల్లో కేవలం 10 ఫీట్ల లోతు లొనే నీటి ఊటపడింది. గ్రామాల్లో వందల ఫీట్ల లోతు బోర్లు వేసినా పడని నీరు, పది ఫీట్లలోపే భూగర్భజలం ఉబికి రావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటి ఊటతోపాటు, గుట్టపై నుండి వర్షపు నీరు ఈ ఫాం పౌండ్ కు వచ్చేలా ఉపాధి హామీ కూలీల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు.